# బలిదాన్

శ్రీ పి. లక్ష్మణరావు బి. ఏ.

"7-80 గంటలయింది. ఇంకా అరగంట టైముంది రైలురావటానికి" అనుకుంది సరళ శీతాకాలముచేత అప్పుడేఎంతో ప్రొద్దుపోయినట్లుంది మిణుకు మిణుకు మనుచున్న రైల్వేదీపము ఎడారిలో కన్పించే కొరివి దయ్యములాగ ఉన్నది ఆచిన్నస్టేషను నిర్మానుష్యముగ ఉన్నది పోర్టరు, స్టేషన్‌మాష్టరు తను తప్ప యింకెవరు లేరు. ఒక లోకల్ ట్రైన్‌వచ్చి అప్పుడే వెళ్ళిపోయింది ఆ స్టేషన్‌లో ఎవ్వరు దిగలేదు. అబ్బ, అరగంట ఎంత సేపటికి గడుస్తుందో!

అరగంటలో ట్రైన్ వస్తుందనగానే ఆమె మనస్సులో అనేక ఊహలు దొర్లిపోయినాయి తన ధైర్యానికి తనకే ఆశ్చర్యం కలిగింది. కాలేజీలో ప్రవేశించగానే ఆమెలో క్రొత్త క్రొత్త ఊహలు భావాలు రేకెత్తినవి. జీవితమంటే ఏమిటో ఆమెకు అర్థముకావటము మొదలు పెట్టింది అంతవరకు ఆమెలో పాతుకొని ఉన్న పురాతనపు భావాలన్నీ నిర్మూలమై పోయినవి. ముఖ్యముగ సామ్యవాదము ఆమెని ఆకర్షించింది. ఆ సిద్ధాంతము మీద లెక్కలేనన్ని గ్రంథాలు చదివింది. పుట్టుకమాత్రముచేఒక వ్యక్తికి యావజ్జన్మ బానిసత్వము, మరొకరికి రాజభోగము మానవ నిర్మితమైన ఈ సంఘ దౌర్జన్యాన్ని రూపుమాప సంకల్పించు కొన్నదై సామ్యవాదసంఘంలో చేరింది. పొంగి పొరలుతున్న ఆమె యౌవన రక్తము ఈనూతన భావాన్ని బారలుసాచి అందుకొంది ఆ ఉద్రేకములో తన స్త్రీత్వమే మరచిపోయింది

"మోహన్ ధైర్యసాహసాలు, దేశసేవ మన హృదయాల్లో ఇంకా ప్రతిధ్వనిస్తునే ఉన్నాయి. 14 ఏండ్లు కారాగార శిక్ష అనుభవించి వస్తున్నాడు అతన్ని తిరిగి గవర్నమెంటు తిరిగిఅరెష్టుచేయ సంకల్పించినట్లు తెలుస్తుంది అందుకని ఆ చిన్నస్టేషన్‌లో దిగి యీ రాత్రి గడపమని మోహన్‌కు టెలిగ్రాంయిచ్చాను మనలో ఎవరైననుసరే వెళ్ళి స్వాగతమిచ్చి, ఈ రాత్రి ఆశయమిచ్చి తిరిగి పంపివేయవచ్చును" అని, సంఘాధ్యక్షుడు చెప్పగానే అందరి దృష్టి గోడమీదనున్న మోహన్ పటము మీదపై పోయింది. విశాలమైన నుదురు, నూనూగు మీసాలు దృష్టి నరికట్టుతున్నాయి

"మనలో ఎవరిస్తారు ఆశ్రయము" అన్నాడు సంఘాధ్యక్షుడు

"నేను"

అందరి దృష్టి సరళమీదపడింది గంభీరమైన వాక్కు, నిశ్చలమైన చూపు. ప్రబలమైన ఆమె నిశ్చయాన్ని వెలిబుచ్చుతున్నాయి.

సరళ ధన్యురాలు దేశసేవకై జీవిత మాధుర్యాన్ని తొలగద్రోసి, కష్టపరంపరకులోనై కారాగారములో మ్రగ్గి సువర్ణాక్షరాలతో లిఖించుకొన్న మోహనుకు ఆశ్రయమిచ్చిన సహాయభూతురాలు కాబోతుంది. ఎంతటి అదృష్టము

రైలువచ్చేటైమయింది మోహన్‌తో ఏమి మాట్లాడటము అపారమైన అతని విజ్ఞాన సంస్కృతములందు తన జ్ఞానము అనుభవము ఎంత! కరుడుగట్టిన అతని త్యాగము 'అహం' ఎరుగని అతని చర్యలయందు! తన సేవ ఎంత!

గణగణ మని గంట వినబడింది. ఉలిక్కిపడి సరళ ఆలోచనా ప్రపంచకము లోనుంచి బయటపడింది. గుండెలు దడ దడ మని కొట్టుకోటము మొదలుపెట్టాయి. తను ఆశించిన మధుర గడియలు సమీపిస్తున్నాయి రైలు స్టేషన్‌లో ఆగింది సరళ ఈచివరనుంచి ఆ చివరవరకు తిరిగి చూసింది ఎవ్వరు దిగేసూచన లేదు రైలు కదిలిపోయింది నిరాశ కలిగింది ఆమెకు ఆ చీకటిలో తిరిగి ఇంటికి ఒక్కతే వెళ్ళాలి మోహన్ రాలేదు ఎందువలననో ? ఒకవేళ తిరిగి ప్రభుత్వమువారు అరెష్టు చేశారా ? ఉష్.

"మిమ్మల్నేనా సంఘాధ్యక్షుడు ఆశ్రయ మివ్వటానికి పంపించింది" అని ఒకవ్యక్తి అడిగాడు.

'ఆ' అంటూ సరళ తిరిగి చూసింది 40 ఏండ్ల వయస్సు. పెరిగిన గడ్డములోనుంచి తొంగిచూస్తున్న నెరసిన వెంట్రుకలు. బట్టతల, మాసిన బట్టలు! ఇది ఆవ్యక్తి ఆకారము.

'మీ రెవరు ? మీ పేరు ?'

'మోహన్' అని, తిరిగి అదే ప్రశ్న వేశాడు

'మోహన్!'

నిర్జీవి అయింది సరళ. సంఘంలో చూసిన ఆ ఫొటోకి ఈ వ్యక్తికి పోలికే లేదు తను నిర్మించుకొన్న ఆశా సౌధము నేల కూలిపోయింది రోత కలిగించే ఈవ్యక్తినే సంఘ మర్యాదకూడ పాటించకుండా తను స్వాగతమిచ్చి ఆశ్రయమిస్తా నన్నది

'న న్ననుమానిస్తున్నారా ?' అన్నాడు ఆ వ్యక్తి మనస్సు స్థిరపరచుకొనలేక పోతున్నారా? రోజుచూస్తున్న పోలీసులు తప్ప యింకెవ్వరు గుర్తుపట్టలేరు నన్ను కారాగారశిక్ష నాదేహ పటుత్వాన్నేగాక మానసిక శక్తినికూడ చంపింది మీకను మానము లేకపోతే మీవెంట వస్తాను లేదా నా దారి

'లేదు, క్షమించండి, రండి మీకొరకే అరగంట నుంచి కనిపెట్టుకున్నాను, అని దారితీసింది.

దారి పొడుగునా మోహన్ ప్రతి విషయాన్ని కుతూహలంగా చూడడము ప్రారంభించాడు, మరొక వ్యక్తి తన ప్రక్కన ఉన్నట్లే అతను భావించలేదు 14 ఏండ్లు ఒంటరి జీవితానికి అలవాటుపడ్డ అతనికి సాటి మానవునితో స్నేహ సంభాషణకు తగిన విషయములు అతని మెదడులో లేవు. జంతు సంచలనము కూడ అతనికి ఆశ్చర్య, విభ్రాంతు కలిగించాయి ఈ వింత ప్రకృతి కొంతసేప టివరకు సరళకు అర్ధముకాలేదు

హోటలునుంచి వచ్చిన క్యారియర్ భోజనము యిద్దరికి వడ్డించింది సరళ. ప్రవాసములో గడిపిన అతని జీవితాన్నిగురించి తెలుసుకోవాలని, అతని చర్యలు వినాలని ఎంతో కుతూహలంగా ఉంది సరళకు కాని మోహన్ ఏమీ మాట్లాడకుండా తల ంచుకొని భోజనము చేయ మొదలుపెట్టాడు

సంఘసంపర్కములేని అతనికి సినీమా కొంత ఉత్సాహము కలిగిస్తుందేమో అని సినీమాకు తీసికొనివెళ్ళింది సరళ కథలో జరిగే ప్రతి ఘట్టములో లీనమైపోయి విచారించేవాడు మోహన్ విచారమయ ఘట్టములలో పిల్లవానివలె వెక్కి-వెక్కి- ఏడ్చేవాడు. ప్రేమ ఘట్టములలో తీక్షణమైన చూపులతో సరళవంక చూసేవాడు సిగ్గుమా అయిపోతూంది. కథ అలవాటుపడ్డ పక్కీ-లోనే నడుస్తోంది. కష్టపరంపరదాటి నాయికా నాయకులు ఒద్దు జేరుకున్నారు ఇక ప్రేమ సీనులో స్వైరవిహారమే తరువాయి. నాయకుడు ప్రేమోత్సాహములతో నా యి క కెమ్మోవి నెత్తి ముద్దాడాడు. తన భుజముమీద ఎవరి చేయో పడ్డది తిరిగి చూసింది సరళ నెమ్మదిగా చెయి తీస్తున్నాడు మోహన్

ఇంటికి బయలుదేరారు,

'ఈ ఒక్కరాత్రే నాకు సుఖము రేపుతిరిగి ఒంటరితనము జైలు. నిర్భేద్యమైన శూన్యము' అన్నాడు మోహన్.

ప్రక్కగదిలో వేయించిన పడక చూపించి 'ప్రయాణపు బడలిక తగ్గుతుంది సుఖముగా పడుకొండి' అన్నది వెళ్ళుతున్నపుడు అతని ముఖములో ఏదో విచారము కన్పించింది

ఆ గది బయటి తలుపు గడియవేసి తన మంచము మీద పడుకుంది సరళ.

నిద్రపోతున్నట్లు తోచటములేదు మోహన్ అటు, ఇటు దొర్లుతున్నట్లు చప్పుడవుతూంది. సినీమాలో అతని చర్యదారిలో అతను అన్న మాటలు, పడుకునే ముందు అతని జాలి ముఖము, ఒకదానివెంట ఒకటి సరళకు గోచరించాయి

తెల్లవారితే అతని గతేమిటో! 14 ఏండ్ల తర్వాత ఒక్కరాత్రి తిరిగి ఏ అఖాద లోయో ఏ అంధకార గుహో!

మోహన్ నిద్రపోవటములేదు

ఎడతెగని సంఘర్షణ బయలుదేరింది సరళ మనస్సులో పది నిముషములు ఏమీ తోచలేదు

బాహ్యసౌందర్యము ఆశించి తను మోహన్‌కు జీవితసర్వస్వము త్యాగము చేయ సిద్ధపడలేదు. కాలవాహినికి లొంగని అతని సేవాదీక్షయే ఆమెని ముగ్ధురాలుగా చేసింది మరి, శివ సౌశీల్యము. తుచ్ఛకామతృష్ణార్తికా తను దేహాన్నర్పిస్తున్నది? నారివలె వంగి ఝంకరించుచున్న తన దేహలింగమునకై, ఉబికి నూతన వక్షోజ వీక్షణకై, తన క్రీగంటి వీక్షణకై, ఎందరు పురుషులు అర్రులు సాచుటలేదు

ఉక్కిరి బిక్కిరి చేస్తున్న యీ ఊహలనుంచి బయటపడేటప్పటికిగూడ గడియారము రెండు గంటలు కొటింది. మోహన్ గదిలో దీపము యింకా వెలుగుతునే ఉంది అటు యిటు పచారుచేస్తున్న మనిషి సవ్వడి వినిపిస్తుంది

సరళ నిశ్చయించుకొన్నది మోహన్ గది గడియతీసి లోపలికి వెళ్ళింది